దేవుడికే శఠగోపం

- దేవుడు మాన్యాన్ని అమ్మేశారు
- కొమ్మాది భూమికి పెదగంట్యాడలో రిజిస్ట్రేషన్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన సీపీఐ నేతలు
- తెర వెనుక కూటమి నేతలు


కొమ్మాదిలోని శ్రీరాముడి ఆలయం


అక్రమార్కులు అమ్మేసిన రామాలయం భూమి

మధురవాడ: అధికార పక్షం నాయకులు బరితెగిస్తున్నారు. ఇంత వరకు ప్రభుత్వ భూములనే ఆక్రమించిన ఘటనలు మారికవలస, మధురవాడ శ్రీలక్ష్మినగర్, శారదానగర్, మిథిలాపురి వుడా కాలనీల్లో బయటపడ్డాయి. కొమ్మాదిలో మాత్రం కూటమి నాయకులు ఏకంగా శ్రీరామాలయం భూములకే పంగనామాలు పెట్టేశారు. మధురవాడ ప్రాంతంలో ఈ విషయం సంచలనంగా మారింది. రాజకీయ పక్షాలు మాత్రం తీవ్రంగా స్పందిస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కొమ్మాది గ్రామంలో సుమారు 100 ఏళ్ల చరిత్ర కలిగిన రామాయలం ఉంది. ఇక్కడ పౌరోహిత్యం చేసే అర్చకులకు సుమారు 80 ఏళ్ల క్రితం విజయనగరం మహారాజులు భూములు ఇచ్చారు. సదరు అర్చకులు కొన్ని భూములను వేర్వేరు వ్యక్తులకు అమ్మకాలు చేశారు. అమ్మగా మిగిన సుమారు 3 ఎకరాలు భూమిని రామాలయం నిర్వహణ, దూప, దీప నైవేద్యాల కోసం కేటాయించారు. ఇందులో సర్వే నంబరు 84లో 31 సెంట్లు, 34లో సుమారు రెండు ఎకరాలు వరకు భూములు ఉన్నాయి. 34లో ఉన్న భూమిలో పాఠశాలకు కొంత కేటాయించారు. మరికొంత స్థలంలో అరటి తోట వేశారు, మిగిలిన స్థలాన్ని సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఈ భూములు మీద వస్తున్న ఆదాయంతోనే ఈ ఆలయం దశాబ్దాలుగా సజావుగా నడుస్తోంది. దశాబ్దాలు నుంచీ నేటి వరకు ఆ భూములు శ్రీరాముడి ధర్మకర్త పేరు మీదనే రెవెన్యు రికార్డులలో ఉన్నాయి.

కూటమి నేతల కన్ను

భూముల విలువ పెరగడంలో కూటమికి చెందిన ఆరిలోవ నాయకుడు, స్థానిక నాయకులతో కలిసి అమ్మకానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా గతంలో కొమ్మాదిలో అర్చకత్వం చేసి, రాజులు నుంచి భూములు సంక్రమించిన పురోహితుల బంధువుల పేరుతో కొందర్ని తీసువచ్చి అమ్మకాలకు సిద్ధం చేశారు. సదరు వారసులు అని చెపుతున్న వారితో తమకు కావలసిన వారికి జీపీఏలు రిజిస్ట్రేషన్‌కు సర్వం సిద్ధం చేశారు. మధురవాడలో రిజిస్ట్రేషన్ చేస్తే విషయం బయటకు వస్తుందని ఎనీవేర్ సౌలభ్యాన్ని ఉపయోగించుకుని పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలంలో సెప్టెంబరు 26న 1500 గజాలు భూమికి తప్పుడు పత్రాలతో 750 గజాలు చొప్పున 7762/2024, 7764/2024 నంబర్లు గల 2 డాక్యుమెంట్‌లతో జీపీఏ చేయించారు. అయితే ఇందులో స్థానిక నాయకులు మాత్రం ఎక్కడ ఎటువంటి సంతకాలు లేకుండా జాగ్రత్త పడ్డారు. పాత మధురవాడ మెట్టుకు చెందిన ఓ వ్యక్తి సాక్షి సంతకం ఉంది. ఈ ఆలయానికి సంబంధించిన మొత్తం భూమిని కొట్టేయడానికి పక్కా ప్రణాళిక ప్రకారమే పత్రాలు సృష్టించారని స్థానికులు చెపుతున్నారు. దీనిపై లోతుగా విచారిస్తే నిజాలు బయటకు వస్తాయని రాజకీయ పక్షాల నాయకులు, స్థానికులు అంటున్నారు.


భారతీయ గైర్ న్యాయిక | पचास रुपये | FIFTY RUPEES | रु.50 | Rs.50 | INDIA NON JUDICIAL | ANDHRA PRADESH

దేవుడు భూమికి సృష్టించిన జీపీఏ డాక్యుమెంట్

గ్రామ పెద్దలు సచ్ఛీలత నిరూపించుకోవాలి

గ్రామంలో ఉన్న ప్రధాన ఆలయానికి సంబంధించి గ్రామ పెద్దలకు తెలియకుండా అమ్మకాలు జరిగాయంటే నమ్మశక్యంగా లేదని, వారి ప్రమేయం మీద అనుమానాలు రేకెత్తుతున్నాయని పలు రాజకీయ పక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇందులో వారి ప్రమేయం లేదన్న విషయాన్ని వారే నిరూపించుకోవాలని కోరుతున్నారు.

పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు

దేవుడు భూమిని అమ్మేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, కొమ్మాది గ్రామ పెద్దలు, యువత పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బాలకృష్ణను కలిసి సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

కఠినంగా శిక్షించాలి

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలోని శ్రీ రామాలయ భూమిలను ఆక్రమించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు డిమాండ్ చేశారు. ఇక్కడ సర్వే నంబర్ 84లో 31 సెంట్ల భూమిని స్థానిక సబ్‌రిజిస్ట్రర్ ఆఫీస్‌లో కాకుండా గాజువాక పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రర్ ఆఫీస్‌లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఒక్కో దస్తావేజు 750 గజాల చొప్పున 2 దస్తావేజులకు దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారని ఆరోపించారు. భూమిని సంరక్షించి ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు సీపీఐ, సీపీఎం కార్యదర్శులు వి.సత్యనారాయణ, డి.అప్పలరాజు, ఎండి బేగం, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు, స్థానికులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

నేడు అయ్యప్ప పీఠం వార్షికోత్సవం

పద్మనాభం: మండలంలోని మద్దిలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి పీఠం ప్రథమ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2008–2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు క్షేమ సమాచారాలు ఒకరినొకరు తెలుసుకున్నారు. 15 ఏళ్ల క్రితం స్కూల్‌లో తాము గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

క్లుప్తంగా

అమ్మో..ట్రాక్టర్ ఇసుక రూ.4500


జీరుపేటలో అన్‌లోడ్ చేసిన ట్రాక్టర్ ఇసుక

తగరపువలస: కూటమి ప్రభుత్వ ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని చెపుతున్న మాటలు వాస్తవంలో చూస్తే గుండె గుబేల్‌మనడం ఖాయం. జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డుకు చెందిన బింగి హరికిరణ్‌రెడ్డి..నాలుగు యూనిట్ల ఇసుక కోసం ఒక ట్రాక్టర్ యజమానిని సంప్రదించగా రూ.4500 వసూలు చేశారు. ఇదేమిటని ప్రశ్నించగా శ్రీకాకుళానికి చెందిన టీడీపీ నాయకులు లారీ ఇసుకను రూ.45 వేలకు తమకు విక్రయిస్తున్నారని, గిట్టుబాటు కావాలంటే రూ.4,500లకు అమ్మాల్సిందేనని బదులిచ్చాడు. ఉచిత ఇసుక ఇస్తామని ప్రజలకు హామీలు ఇచ్చి అడ్డగోలుగా దోచుకుంటున్నారని హరికిరణ్ ఆరోపించారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ


గంభీరంలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు


తగరపువలస: ఇండియన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గంభీరం వాగ్దేవి పాఠశాలలో కరాటే శిక్షణ కార్యక్రమం జరిగింది. ఐదు పాఠశాలలకు చెందిన 50 మంది బాలబాలికలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఏటా ఈ పాఠశాలలో శిక్షణ అనంతరం గ్రేడులు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ పి.బాలకృష్ణ, ఎ.నూకరాజు, వి.గోపీకృష్ణ, పి.రాజు, ఆర్.శరత్‌చంద్ర, నాయుడు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారికి ఆర్థిక సాయం


షాపు వద్ద ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న టీ షాపు పునర్నిర్మాణానికి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్), సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సభ్యులు ఆర్థిక సాయం చేయగా ఆదివారం షాపును ప్రారంభించారు. ఇక్కడ నాగ రాజేంద్రప్రసాద్ చిన్న టీ షాపును నిర్వహిస్తున్నాడు. ఇటీవల వచ్చిన తఫాను వల్ల అతని షాపు బాగా దెబ్బతింది దాన్ని బాగు చేయించుకోవడానికి స్తోమత లేక ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఫ్యాబ్ సభ్యులు రూ.పది వేలు, వాకర్స్ సభ్యులు రూ.ఏడు వేలు సాయం చేశారు. దీంతో ఇతను తన షాపును పునర్నిర్మించుకున్నాడు. ఈమేరకు తనకు సాయం చేసిన వారికి అతను కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కోడి రామ్మూర్తి నాయుడు జయంతి


కోడి రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్

పీఎం పాలెం: ప్రపంచ ప్రఖ్యాత మల్లయుద్ధ వీరుడు, తెలుగుతేజం కోడి రామ్మూర్తి నాయుడు జయంతిని ఆదివారం శిల్పారామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీకాకుళం జన్మించిన కోడి రామ్మూర్తినాయుడు ప్రపంచ బలశాలిగా కీర్తి పొందడం తెలుగువారందరికీ గర్వకారణమన్నారు. డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ ట్రైనర్ పెదిరెడ్ల కనకారావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జాతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇదరి అదృశ్యంపై వేర్వేరుగా ఫిర్యాదులు


సంతోష్ కుమార్ (ఫైల్)

పీఎంపాలెం: ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైనట్టు వేర్వేరుగా ఫిర్యాదులు అందాయి. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు...బల్లంకి నాగరాజు మిథిలాపురి వుడా కాలనీలో బృందావన్ అపార్ట్ మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య ఆదిలక్ష్మి కూడా అదే అపార్టుమెంట్‌లో ఇంటి పనులు చేస్తుంటుంది. శనివారం సాయంత్రం భార్యభర్తలిద్దరూ గొడవ పడ్డారు. అనంతరం నాగరాజు టిఫిన్ తినేందుకు బయటకు వెళ్లాడు. రాత్రి 11 గంటలకు వచ్చేసరికి భార్య ఇంటి వద్దలేదు. సీసీ ఫుటేజ్ పరిశీలించగా అపార్ట్‌మెంట్ వెనుక గేటు నుంచి కుమార్తెను తీసుకుని వెళ్లి పోయినట్లు గుర్తించారు. చుట్టుపక్కలా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాజీవ్ గృహకల్ప కాలనీలో...


కుమార్తెతో ఆదిలక్ష్మి (ఫైల్)

రాజీవ్ గృహకల్ప కాలనీ 68వ బ్లాకు ఎఫ్ఎఫ్-2 లో నివసిస్తున్న దామరసింగి సంతోష్‌కుమార్ ఎలక్ట్రిక్ పనులు చేస్తుంటాడు. కుటుంబ వివాదాల కారణంగా భార్యతో వేరుగా ఉంటున్నాడు. గత నెల 29వ తేదీన ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి పోయాడు. అతని తండ్రి నాగరాజు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్‌లో ఉంది. చట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండు కేసులకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు అరుణ్


అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న సర్పంచ్ జగదీశ్వరరావు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీహైస్కూల్ 8వ తరగతి విద్యార్థి మొకర అరుణ్‌కుమార్ త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 2న కణితి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో అరుణ్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఆదివారం అరుణ్‌కుమార్‌ను స్థానిక సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు జి.పైడిరాజు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.లలిత్‌కుమార్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా సత్తాచాటాలని ఆకాంక్షించారు.

శబ్ద కాలుష్య కారకులకు జరిమానా

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి శబ్ద కాలుష్యానికి పాల్పడిన నలుగురు యువకులకు పోలీసులు జరిమానా విధించారు. విశాఖకు చెందిన యువకులు సైలెన్సర్లు లేకుండా వాహనాలు నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ సుధాకర్ తెలిపారు. వారి తల్లి తండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు ఒక్కొక్కరికి రూ 1,135 జరిమానా విధించినట్టు చెప్పారు.

మద్యం షాపు తరలించాలంటూ ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న భీమిలి ఎస్ఐ హరీష్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు అంబేడ్కరు కూడలి నుంచి కొండపేటకు వెళ్లే మార్గంలో మద్యం దుకాణాలను తొలగించాలని స్థానికులు గంటన్నరపాటు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. బలవంతంగా మద్యం దుకాణాలను మూయించారు. ఈ సందర్భంగా కొండపేట వాసులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం మరో మద్యం దుకాణం రావడంతో పాటు పాత మద్యం దుకాణంలో కూడా విక్రయాలు జరుపుతున్నారన్నారు. ఈ మద్యం దుకాణాలపై ఆధారపడి చుట్టూ పలు ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు వెలిశాయన్నారు. ఇక్కడే బెల్టుషాపులు కూడా నిర్వహిస్తున్నారన్నారు. మందుబాబులు చెలరేగిపోతున్నారన్నారు. మద్యం సేవించి దుకాణాల చుట్టూ ఇళ్లలోకి ప్రవేశించడం, రహదారిపైనే పడిపోతున్నారన్నారు. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థినులు, మహిళా ఉద్యోగినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మద్యం మత్తులో వీరి బూతు పురాణం భరించలేక ఒంటరిగా రాకపోకలు చేయడానికి కూడా ఇబ్బందిగా ఉందన్నారు. మహిళలపై దాడులకు కూడా తెగబడుతున్నారన్నారు. ఈ కొండపేట మార్గంలో రెండు జడ్పీహైస్కూళ్లు, బాలికల వసతిగృహం, పలు ఆలయాలు, చర్చ్‌లు, 15 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ మార్గంలో రహదారి కూడా సక్రమంగా లేదని అలాంటి చోట మందుబాబులు తమ వాహనాలను కూడా అడ్డం పెట్టి రాకపోకలు సాగించేవారిపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ మద్యం దుకాణాలను ఈ ప్రాంతం నుంచి తరలించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. తాము దళితులమనే చులకన భావన కూటమి ప్రభుత్వంలో ఉన్నందున నెల రోజులుగా నిరసన తెలియచేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదన్నారు.

ఈ సందర్భంగా అంబేద్కరు కూడలికి వెళ్లి నిరసన తెలియచేయడానికి అనుమతి లేదని అరెస్టులు చేస్తామని భీమిలి పోలీసులు భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ఎస్ఐలు గంటా హరీష్, గౌరి, సిబ్బంది ఆందోళన కారులతో మాట్లాడారు. దీంతో ఎట్టకేలకు శాంతించిన కొండపేట వాసులు సోమవారం భీమిలి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామని, అప్పటికీ దుకాణం తరలించకపోతే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా గోవర్ధన పూజ


108 రకాల పిండివంటలతో గోవర్ధనగిరి నమూనా


గోమాత సేవ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవి రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా గోవర్ధన పూజ నిర్వహించారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస భక్తులకు గోవర్ధన లీలా విశేషాలను వివరించారు. 5 వేల ఏళ్ల క్రితం శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలితో ఎత్తి బృందావన వాసులను ఇంద్రుని ఆగ్రహం నుంచి రక్షించాడన్నారు. ప్రస్తుతం ఈ పర్వతం ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లా బృందావనంలో ఉందన్నారు. శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన లీల జరిగిన దామోదర మాసంలో గోవర్ధనగిరి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ వారిచే శాకాహారంతో కూడిన గోవర్ధనగిరి నమూనాను అన్నకూటంలో వివిధ రకాలైన 5వేల లడ్డూలు, 108 రకాల తీపి, వివిధ రుచులతో వంటకాలు తయారు చేసి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. వీటిలో రాగిలడ్డు, రాగి జంతికలు, కాజా, మైసూర్‌పాక్, గులాబిరేకులు, జంతికలు, అటుకులు, అరిసెలు, రవ్వలడ్డు, చేగొడీలు, కొబ్బరి లడ్డు, సంపంగిరేకులు, పంచదార అరిసెలు, కోవా, నువ్వుండలు, డ్రై ఫ్రూట్స్, లెమన్ వాటర్, పాలు, పెరుగుతో తినుబండారాలు ఉంచారు. ఈ గోవర్ధనగిరి నమూనా చుట్టూ పరిక్రమ చేస్తే 25 కిలోమీటర్ల గోవర్ధనగిరి పర్వతం చుట్టూ పరిక్రమ చేసిన ఫలితం లభిస్తుందన్నారు. అనంతరం గోమాతకు పూజలు నిర్వహించారు. భక్తులు గోమాతకు ప్రసాదాలు తినిపించారు.

27 నుంచి లక్ష దీపోత్సవం

నగరంలోని కృష్ణ భక్తుల కొరకు ఈ నెల 27 నుంచి డిసెంబర్ ఒకటి వరకు ఐదు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి హరేకృష్ణ వైకుంఠ మందిర నిర్మాణ ప్రదేశంలో లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులంతా వినియోగించుకోవాలని అంబరీష దాస తెలిపారు.

ఇనాం భూసమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగారావు

పద్మనాభం: భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఏళ్ల తరబడి ఉన్న ఇనాం భూ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జీవీఎం78 వార్డు కార్పొరేటర్, సీపీఎం జిల్లా నాయకుడు బి.గంగారావు డిమాండ్ చేశారు. పద్మనాభంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సీపీఎం భీమిటి జోన్ కమిటీ 12వ మహాసభలో ఆయన మాట్లాడారు. రైతులకు సాగు నీటి సదుపాయం కల్పించాలన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు తగరపువలస, ఆందపురం, పద్మనాభం మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక రంగం పేరిట తీర ప్రాంతాన్ని కబళించే కుట్రను తిప్పి కొట్టాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట జరుగుతున్న భూ దోపిడిని ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. పార్టీ జోన్ కమిటీ నేత కె.నాగరాణి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో బి.పద్మ, రవ్వ నరసింగరావు , ఎస్.అప్పలనాయుడు, ముద్దాడ రాము పాల్గొన్నారు.

భీమిలి జోన్ నూతన కార్యవర్గం

సీఐటీయూ భీమిలి జోన్ కమిటీ కార్యవర్గాన్ని ఎనుకున్నారు. కార్యదర్శిగా ఆర్.ఎస్.ఎన్.మూర్తి, కార్యవర్గ సభ్యులుగా రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, ఎస్.అప్పలనాయడు, కె.సత్యనారాయణ, ఎస్.గున్న, బి.లక్ష్మి, రాము, ఓళ్ల నాగరాజు, కె.చిరంజీవి ఎన్నికయ్యారు.

దాడికి పాల్పడిన యువకుడి అరెస్ట్


నిందితుడు జగదీష్‌తో పోలీసులు

భీమునిపట్నం: దారికాచి పలువురుపై దాడికి పాల్పడ్డ వారిలో పరారీలో ఉన్న యువకుడిని ఆదివారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల ఆరో తేదీన తగరపువలస సమీపంలో దారి కాచి పలువురిపై దాడులకు పాల్పడ్డ ఐదుగురు యువకుల్లో నలుగురు అరెస్ట్‌కాగా.. భీమిలి ఎగువపేటకు చెందిన వాసుపల్లి జగదీష్ తప్పించుకుని తిరుగుతున్నాడు. ఎస్ఐ హరీష్, కానిస్టేబుళ్లు కనకారావు, అప్పారావు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈమేరకు వారిని నార్త్ జోన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, సీఐ బి.సుధాకర్ అభినందించారు.

కిక్ బాక్సింగ్‌లో పవన్ సతీష్‌కు టైటిల్



తగరపువలస: ఈ నెల 1 నుంచి 3 వరకు కేరళలోని కొచ్చి ఇండోర్ స్టేడియంలో కేరళ కిక్ బాక్సింగ్, వాకో ఇండియా నిర్వహించిన కేరళ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2024లో సంగివలసకు చెందిన ఎం.పవన్ సతీష్ రాష్ట్రం నుంచి మొదటి స్థానంలో నిలిచి టైటిల్ సాధించాడు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రి రేడియాలజీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. మరోమారు జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కేరళ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ట్రోఫీ, పతకం ఇచ్చి అభినందించాయి. తన విజయానికి సహకరించిన రేడియాలజీ వైద్యులు, సహోద్యోగులు, ఆస్పత్రి యాజమాన్యానికి పవన్ సతీష్ కృతజ్ఞతలు తెలిపాడు.

'కార్తీక' పూజలకు సిద్ధం


సంగివలస శివాలయంలో ఉమారామలింగేశ్వరుడు

తగరపువలస : భీమిలి నియోజకవర్గంలోని సంగివలస పురాతన ఉమారామ లింగేశ్వర ఆలయం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కార్తీక సోమవారం పూజలకు సిద్ధం చేశారు. సుమారు 400 ఏళ్ల పై చరిత్ర కలిగిన ఈ ఆలయం పలుమార్లు పునరుద్ధరణకు నోచుకుంది. చివరిసారిగా ఈ ఆలయాన్ని 2000 సంవత్సరంలో రూ.2 లక్షల దాతల సాయంతో పునరుద్ధరించారు. సంగివలస కొత్తమ్మతల్లి గ్రూపు దేవాలయాల పరిధిలో ఉన్న ఈవో ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తుంటారు. ప్రస్తుతం సంగివలస శివారులో ఉన్న ఈ ఆలయం ఆవరణలో పలు దేవతా వృక్షాలతో ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది. భీమిలి మండలంలో అమనాం, లక్ష్మీపురం, మూలకుద్దు, తాళ్లవలస, బసవపాలెం, ఆనందపురంలో మండలంలోని కుసులవాడ, గుడిలోవ, జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో చిట్టివలస, కొండపేట, విల్సన్‌పేట, బంగ్లామెట్ట, సంతపేట, సత్యనారాయణపేట శివాలయాలలో కార్తీకమాస పూజలకు ఆలయ కమిటీల ప్రతినిధులు ఆలయాలను సిద్ధం చేస్తున్నారు.